3కే రన్

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి మిథిలానగర్‌లో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3కే రన్ నిర్వహించగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ 3కే రన్‌కు విష్ణు బయోకెమికల్స్, ఫార్చ్యూన్ బయో సొల్యూషన్స్, ప్రసాద్ హాస్పిటల్స్, మైమెడ్ హాస్పటల్స్, పీపుల్స్ ఆస్పత్రి, వాసవీ మెడికల్స్, సీపీజే సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లు స్పాన్సర్లుగా వ్యవహరించాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన 3కే రన్ మిథిలానగర్‌లో ప్రారంభమై బాచుపల్లి చౌరస్తా మీదుగా కొనసాగి చివరకు కాలనీలో ముగిసింది.

– నిజాంపేట్



నువ్వు పో.. నేనొస్తున్నా..!

సూర్యుడు, చంద్రుడు ఒకే సారి ఆకాశంలో కనిపించడం అరుదుగా చూస్తుంటాం. ఇదే సీన్ కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో శనివారం సాయంత్రం 6:30 గంటలకు కనిపించింది. సూర్యుడు అస్తమిస్తున్న తరుణంలో చంద్రుడు పైభాగంలో ఉండటం.. ఒకేచోట సూర్య చంద్రులు ఉన్నట్లు అనిపించింది. ఈ దృశ్యం చంద్రుడు సూర్యుడితో ఇలా ''నువ్వు పోయిరా.. నేను ఒస్తున్న..''అంటున్నట్లుగా కనిపించింది.

– సుభాష్‌నగర్



అస్తమిస్తున్న సూర్యుడి పైభాగంలో చంద్రుడు

మట్టల ఆదివారం

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం గుడ్ ఫ్రైడేకు ముందు ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈత, తాటి మట్టలతో వీదులలో తిరుగుతూ.. ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత చర్చీలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

– జగద్గిరిగుట్ట



ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట


కేఎం ప్రతాప్‌ను కలిసిన ముద్దాపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పెద్దపీట వేస్తూ ఆ దిశగా ముందుకు సాగుతున్నామని మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. ఆదివారం ముద్దాపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా సరైన రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతాప్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. సంక్షేమ సంఘం సలహాదారులు కృష్ణారెడ్డి, వెంకటేష్, అధ్యక్షుడు జంగయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి ధనుజయుడు, శ్రీరామ్, శ్రీహరి, హేమంత్, రాజేష్, శివ, సాయికుమార్, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివస్, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైన్స్ సర్వర్‌పై కత్తితో దాడి

ఆస్పత్రికి తరలింపు.. కేసు నమోదు

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. షాపూర్ నగర్ వివేకానందనగర్‌కాలనీకి చెందిన షేక్ సర్వర్(42) శనివారం రాత్రి గాజులరామారంలోని రామారం వైన్స్ వద్దకు వెళ్లాడు. మద్యం దుకాణం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తితో రాత్రి 8గంటలకు సర్వర్‌కు గొడవ జరిగింది. అనంతరం రాత్రి 10గంటలకు సర్వర్ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గుడ్‌షెపర్డ్ పాఠశాల వద్ద సదరు గుర్తు తెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి చేతులపై ముఖంపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న సర్వర్ భార్య సర్వర్‌ను తీసుకుని వెళ్లి మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం అడ్మిట్ చేసింది. సర్వర్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కసారిగా చెలరేగిన మంటలు


నిజాంపేట్‌లోని శ్రీరామకుంట ఎదురుగా ఎగసి పడుతున్న మంటలు

నిజాంపేట్: ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నిజాంపేట్‌లోని శ్రీరామకుంట సమీపంలోని కాలనీవాసులు బెంబేలెత్తారు. ఆదివారం రాత్రి శ్రీరామకుంటను ఆనుకుని ఉన్న గోడ వెంబడి ఉన్న ఎండిపోయిన చెత్తకు నిప్పు అంటుకోంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. అయితే ఎవరైనా చెత్తకు నిప్పు పెట్టారా లేదా ఎండలకు మంటలు వ్యాపించాయా? అనేది తెలియాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


నాగరవి కుమార్(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నాగరవికుమార్ జీడిమెట్ల రాఘవేంద్రకాలనీలో నివాసముంటున్నాడు. కాగా గతంలో కారు డ్రైవర్‌గా పనిచేసిన అతను ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పలువురి వద్ద అప్పులు చేశారు. రుణం ఇచ్చిన వారి ఒత్తిడి పెరగడంతో మనస్థాపానికి గురైన అతడు శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



కుత్బుల్లాపూర్: ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీన కొంపల్లి బ్రిడ్జి సమీపంలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు (65) రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతను శనివారం మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రంగుల సందడి


షాపూర్‌నగర్ మార్కెట్‌లో రంగులను కొనుగోలు చేస్తూ..

హోలీ పండుగ నేపథ్యంలో ప్రధాన మార్కెట్లలో వివిధ వర్ణాల రంగులు, హోలీ ఆడే పిచికారిలు, చిలకల పీర్లు, కొబ్బరి కుడకల దండలు ఆకర్షణగా నిలిచాయి. షాపూర్‌నగర్ మార్కెట్, జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్, ఐడీపీఎల్ చౌరస్తాలోని ప్రధాన రహదారుల వెంబడి రంగుల విక్రయాలు కొనసాగాయి. చిన్నారులను ఆకర్షించే విధంగా వివిధ ఆకృతుల్లో ఉన్న పిచికారిలు రూ.100 మొదలుకుని రూ.200 వరకు ధర పలికాయి. అదే విధంగా హోలీ నాడు చిన్నారులకు ధరింపజేసి చిలకల పీర్లు, కొబ్బరి కుడకల దండలను ప్రజలు కొనుగోలు చేశారు. ఈ దఫా కొద్దిగా అమ్మకాలు మందగించాయని విక్రయదారులు పేర్కొంటున్నారు. అయితే సహజసిద్ధమైన రంగులతో హోలీ ఆడాలని అధికారుల సూచించినా రసాయన రంగులే ఎక్కువగా ప్రధాన మార్కెట్లలో కనిపించాయి.

– రంగారెడ్డినగర్


చిలకల పీర్లు, కొబ్బరి కుడకల దండలను చూపుతున్న వ్యాపారి కృష్ణ


మార్కెట్లను ముంచెత్తిన వివిధ వర్ణాల్లో రసాయన రంగులు

భారత్‌ను ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత

బీజేపీ ప్రభుత్వానిదే..

మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్


లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: భారతదేశాన్ని ప్రపంచస్థాయి ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శాటిలైట్ టౌన్‌షిప్, లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్, దుర్గా విహార్ ప్రాంతాల్లో ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. దేశానికి ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చిన ప్రధాని నరేందర్ మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభకు పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి అత్యధిక మెజారీతో ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, శానిలాట్ టౌన్‌షిప్ అధ్యక్షుడు శ్రీకాంత్, లక్ష్మీగంగా ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆహార కల్తీలపై ఫిర్యాదు చేయొచ్చు

కుత్బుల్లాపూర్: ఆహార కల్తీలపై ఫిర్యాదులు సులభతరం చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు టోల్‌ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలతో పాటు హోటళ్లు, బేకరీలు, ఆహార ఉత్పత్తి కేంద్రాల్లో కల్తీ విషయమై గ్రేటర్ పరిధిలోని వినియోగదారులు 040-21111111 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. అదే విధంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ చేసిన తరువాత రేటింగ్ ఇచ్చే ఆప్షన్ పక్కనే ఫిర్యాదు నెంబరుతో పాటు ఫీడ్‌బ్యాక్ బాక్స్ ఉండేలా కొత్త నిబంధనలను అమలులోకి తీసువచ్చారు.

మల్కాజ్‌గిరిలో విజయానికి సమష్టిగా పనిచేయాలి

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని చేజిక్కించుకోవడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఈ నెల 26న జరిగే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం బాచుపల్లిలో హన్మంతరెడ్డి అధ్యక్షతన సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం విషయంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, పార్టీ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించేలా కష్టపడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, బాచుపల్లి కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు జేమ్స్, అంజాద్, సంజీవ్ రెడ్డి, శివ కుమార్, ఎల్లయ్య, బేకు శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, జక్కుల మహేష్‌యాదవ్, మహిళా నాయకులు కౌసల్య, గంగుల అంజలి యాదవ్, రఫియా బేగం, సుజాతయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

రాయదుర్గం: అక్రమంగా ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లోని ఓ ఇంట్లో బంజారాబస్తీకి చెందిన కెతావత్ చందర్ (60) మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం అతడిని అరెస్ట్ చేశామన్నారు. మద్యం బాటిళ్ల విలువ సుమారు రూ.6,412 ఉంటుందని వివరించారు.

భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిల్లోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మణికొండ సేవియర్స్ లూథరస్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఫాస్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏసు ప్రభువుకు జయం చెప్పే కార్యక్రమంలో భాగంగా మట్టల ఆదివారాన్ని నిర్వహిస్తామన్నారు. ఈత మట్టలతో నృత్యాలు చేస్తూ.. పాటలు పాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పరిశోధక విద్యార్థి ఎండీ.జిలానీకి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి ఎం.డీ జిలానీకి పీహెచ్‌డీ డిగ్రీకి ఎంపికయ్యారు. యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఈ డిగ్రీని ప్రకటించారు. ఆయన 'ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషన్ యాక్ట్–2009 ఆన్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్–ఏ స్టడీ ఆఫ్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆయనకు యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ సయ్యద్ నజీవుల్లా పర్యవేక్షణ చేయగా.. సహ పర్యవేక్షణను మాజీ ప్రొఫెసర్ వీసీ ప్రొ.ఎస్ఎం రహమతుల్లా ఆధ్వర్యంలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించగా పరిశీలించిన అనంతరం డిగ్రీని ప్రకటించారు.

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకం


జీ-20 మోడల్ సదస్సులో ప్రతిభ కనబరిచిన చిన్నారికి మెమోంటోను అందజేస్తున్న రామేశ్వర్‌రెడ్డి, వినోద్ జాదవ్

రంగారెడ్డినగర్: దేశ, సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని చిన్ననాటి నుంచే విద్యతో పాటు సామాజిక, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆలోచన విధానంపై పట్టుదల కనబరిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థితికి ఎదుగుతారని మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు లయన్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డి నగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్‌లో జీ-20 మోడల్ శిఖరాగ్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 71 విద్యార్థులు వారి నైపుణ్యతను ప్రదర్శించారు. వివిధ దేశ ప్రధానులుగా, సెక్రటరీ జనరల్లుగా విద్యార్థులు పాత్రలు పోషించి ఆకట్టుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ప్రసాద్, బ్రైట్‌కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ వినోద్ జాదవ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజానికి ఏదైనా చేయాలనే ఆకాంక్ష విద్యార్థుల్లో పెరుగుతుందన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం వినోద్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారిలోని సృజనాత్మకత వెలికితీస్తూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సమాజాభివృద్ధిలో భాగస్వాములయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

◆ ఈ సదస్సులో విద్యార్థులందరూ ఇంగ్లీషుల, హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడి పాత్రలకు తగినట్లు చర్చించి, అన్ని దేశాల నేతలు పాల్గొని వారి అభివృద్ధి, సమస్యలు ఎలా పరిష్కరించుకుంటారో కళ్లకు కట్టినట్లు చూపించి ఆకట్టుకున్నారు. గతంలో పాఠశాలలో ×మాక్ పార్లమెంట్‌×సదస్సు నిర్వహించామని పార్లమెంట్ నుంచి అభినందన పత్రాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ఆయేషా, సదస్సు నిర్మాణ కర్త ప్రభు, ఉపాధ్యాయులు వికాస్, కె.సతీష్, ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.